క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మోజర్లకు చెందిన గోపి వారం రోజుల క్రితం ప్రమాదానికి గురయ్యాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎంపీపీ మేఘారెడ్డి స్పందించి ఆదివారం గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25వేలు అందజేశారు. రానున్న రోజుల్లో అండగా ఉంటానని భరోసానిచ్చారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



పాన్‌గల్: మండలంలోని శాగాపూర్–శాగాపూర్‌తండా రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం ఒక వైపు ఒరిగి తీగలు కిందకు వాలి ప్రమాదకరంగా మారింది. ఈ స్తంభంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ప్రయాణికులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం



పాన్‌గల్: మండలంలోని మాందాపూర్‌లో త్రైతసిద్ధాంతం–ప్రభోదా సేవాసమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ద్వారా ఆదివారం ప్రచారం నిర్వహించారు. పెబ్బేర్ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ గురించి తెలిపారు. కార్యక్రమంలో సురేష్, వెంకట్రాముడు, కృష్ణయ్య, నాగరాజు, బద్రి, మన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: రైల్వేస్టేషన్ ఏరియాలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, బాలు, జాంగీర్, శివ, మాసన్న, వేణుగోపాల్, శంకరమ్మ, మంజుల, లయ పాల్గొన్నారు.

గుంతలమయంగా శాగాపూర్ రోడ్డు



పాన్‌గల్: మండల కేంద్రం నుంచి శాగాపూర్ వరకు ఉన్న బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రం నుంచి 6 కి.మీ. దూరం ఉన్న బీటీ రోడ్డు అడుగుకో గుంత ఉండటం, దగ్గరికి వచ్చే వరకు గుంతలు ఉన్న విషయం తెలియకపోవడం, వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి గుంతల రోడ్డుకు మరమ్మతు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విరాళం అందజేత

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసంలో తలపెట్టనున్న కోటిలింగాల ప్రతిష్టకు వనపర్తి పట్టణ కేంద్రానికి చెందిన కిషోర్‌కుమార్, కిరణ్ రూ.27,116 విరాళంగా అందజేశారు. కోటిలింగాల ప్రతిష్టలో భక్తులు భాగస్వాములు కావాలని ఆలయ ప్రధాన కార్యదర్శి శేఖర్ కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వీపనగండ్ల: మండలంలోని కల్వరాళ్లకు చెందిన మేస్త్రీ రాముడు అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం గ్రామ మేస్త్రీ సంఘం సభ్యులు రూ.10వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. సీఐటీయు జిల్లా అధ్యక్షుడు రాజు, మేస్త్రీ సంఘం జిల్లా కార్యదర్శి నిక్సన్, బాల్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి నలుగురు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నారని, భవననిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ అకస్మాత్తుగా మరణించడంతో వారి కుటుంబం వీధినపడిందని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, నర్సింహ, మల్లేష్, కృష్ణయ్య, శేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

‘హరిత’మొక్కలు సిద్ధం

- నర్సరీల్లో 2.68 లక్షల మొక్కలు
- సంరక్షణలో నిర్వాహకులు



వెంకటాంపల్లి నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

ఖిల్లాఘనపురం: ప్రతి గ్రామంలో వేల సంఖ్యలో మొక్కలను పెంచి వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఇప్పటికే 8 విడతల్లో మొక్కలు నాటే కార్యక్రమాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున చేపట్టారు. ఈ సంవత్సరం మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ముమ్మరంగా ఏర్పాట్లు మొదలు పెట్టారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్ ప్రతి గ్రామంలో పర్యటించి నర్సరీలలో మొక్కలు పెంచేందుకు కార్యదర్శులు, కూలీలకు సూచనలు చేస్తున్నారు.

ప్రతి గ్రామంలో నర్సరీ

ప్రభుత్వం గతంలో కొన్ని గ్రామాలను ఎంపిక చేసుకుని లక్ష మొక్కల చొప్పున పెంచేవారు. కొత్త రెవెన్యూ చట్టంలో హరితహారం పథకాన్ని చేర్చడంతో ప్రతి పంచాయతీలో తప్పని సరిగా నర్సరీని ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 27 పంచాయతీలు ఉండగా అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచారు. ప్రతి పంచాయతీలో కనీసం 10 వేల మొక్కలకు తక్కువ కాకుండా పెంచుతున్నారు.

2.68 లక్షల మొక్కలు

మండలంలో మొత్తం 27 పంచాయతీలకు గాను ఒక్కో పంచాయతీలో 10వేల మొక్కల చొప్పున మొత్తం 2.68 లక్షల మొక్కలు పెంచినట్లు అధికారులు తెలిపారు. గతేడాదివి 20వేల మొక్కలు ఉన్నట్లు చెప్పారు. మండలంలో ఇప్పటికే అన్ని గ్రామాల్లో మొక్కలు పెంచి 98 శాతం సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

గుంతలు తవ్వాం..



వర్షాలు కురిసిన వెంటనే నాటేందుకు మండలంలోని అన్ని గ్రామాల నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచాం. మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వించాం. నాటే వరకు మొక్కలకు ప్రతిరోజు నీళ్ల పట్టేలా ఏర్పాట్లు చేశాం.

–విజయ్‌కుమార్, ఎంపీడీఓ, ఖిల్లాఘనపురం

ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలి



అమరచింతలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

కొత్తకోట: దేశ కోసం ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలని ఏబీవీపీ పూర్వ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరశురామ్ అన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం స్వామి వివేకానంద విగ్రహం దగ్గర ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1949 జులై 9న ఏబీవీపీని ఓంప్రకాష్ బేహల్ స్థాపించారన్నారు. ఏబీవీపీ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉంటుందని, జాతీయ పునర్నిర్మాణమే ధ్యేయంగా, విద్యార్థుల్లో జాతీయ భావన పెంపొందించే విధంగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో అజయ్‌కుమార్, హరికృష్ణ, నరేంద్ర తదితరులు ఉన్నారు.

అమరచింత: పట్టణంలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగ నిర్వహించారు. స్థానిక జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణంలో జెండాను ఎగురవేసి నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ దేశంలో అతి పెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ ఏర్పడి 75ఏళ్లు కావస్తుందన్నారు. కార్యక్రమంలో వినోద్, అనిల్‌కుమార్ రెడ్డి, అఖిల్, రాజేష్, ప్రశాంత్, వంశీ, రవివర్మ, సందీప్, రాజేష్ పలువురు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని ఫిర్యాదు

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరికి చెందిన ముంత శేఖర్, తమ గ్రామంలోని పలువురు తాము మోకాపైన ఉన్న స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించాలని బెదిరిస్తున్నారని వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారని వీరి నుంచి రక్షణ కల్పించాలని, ఫిర్యాదును వనపర్తి డీఎస్పీ కార్యాలయంలో కూడా అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పార్టీకి పూర్వ వైభవం

కొత్తకోట: తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు ముందుకు రావాలని కొత్తకోట మండల నాయకులు బాలకొండయ్య, అబ్దుల్ గఫార్, సుల్తాన్, జనార్దన్‌గౌడ్, భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తిరుగుతూ కమిటీలు వేయాలని, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలన్నారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు శ్రమించాలన్నారు. పార్టీ సానుభూతి పరులను, కార్యకర్తలను ఏకం చేసి రానున్న ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో చంద్రమోహన్, వలియోద్దీన్, కొండన్న, వెంకటయ్య, ఈశ్వరయ్య, శ్రీనివాసులుశెట్టి తదితరులు ఉన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం

వనపర్తిటౌన్: నీట్‌లో జాతీయ స్థాయిలో ర్యాంక్ సాధించిన పవన్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు వెంకటనారాయణ రూ.5,116 నగదును అందజేశారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని, తోటి వారికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షించారు.

కొనసాగిన కార్మికుల సమ్మె



పాన్‌గల్: డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడారు. జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని, కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాము, నాగరాజు, పెంటయ్య, యాదగిరి, స్వామి, కుర్మయ్య, సుగ్రీవుడు, నాగమణి, బాలస్వామి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

పెబ్బేరు: హైదరాబాద్‌లో కళావేదిక జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు విజయకుమార్‌ను ఆదివారం చైర్మన్ ప్రతాప్, లలిత, ఈశ్వరి భాషణం తదితరులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

సాయిచంద్‌కు ఘన నివాళి



ఆత్మకూర్: దివంగత రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ చిత్రపటానికి స్నేహితులు, మాలమహానాడు, బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం స్థానిక గాంధీచౌక్‌లో పూలమాలలువేసి నివాళి అర్పించారు. ఉద్యమంలో సాయిచంద్ పాటలు స్ఫూర్తిదాయకమని ఆయన లోటు తీర్చలేనిదని అన్నారు. కార్యక్రమంలో రవియాదవ్, రఘు, కురుమూర్తి, విష్ణు, వెంకటేష్, ఆనంద్, రమేష్, కనకప్ప, అంజి, బాలు, మహేష్ ఉన్నారు.

కరాటే గ్రేడింగ్ టెస్ట్‌లో ప్రతిభ

మదనాపురం: కొత్తకోట పట్టణంలో గాడ్స్ ఆన్ వారియర్స్ దోబుఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో 15 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచి బెల్ట్, ధ్రువపత్రాలు అందుకున్నారు. మండలంలోని తిరుమలాయపల్లికి చెందిన విద్యార్థి సాయికిరణ్ ఎల్లో బెల్ట్ సాధించాడు. మాస్టర్ వడ్డే శివరాజ్, ఫౌండర్ అబ్దుల్‌నబీ, ఆయనను అభినందించారు.

పట్టణవాసుల కల సాకారం



మహిళకు కరపత్రాన్ని అందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్, నాయకులు

వనపర్తి: పట్టణవాసుల కల వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చొరవతో సాకారమవుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. ఆదివారం విద్యుత్‌లైట్ల ఏర్పాట్లు, మొక్కలు నాటేందుకు చేస్తున్న పనులను పరిశీలించారు. జిల్లా కేంద్రంలో పెరిగిపోయిన వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కావొద్దని, విశాలమైన రోడ్లు, విద్యుత్‌లైట్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అత్యంత సమస్యగా ఉన్న పాతబజార్, చిట్యాలరోడ్డు, పాన్‌గల్‌రోడ్డులలో దాదాపు రోడ్ల విస్తరణ పనులు పూర్తిచేశామని, కర్నూల్‌రోడ్డు, పాన్‌గల్‌రోడ్డులోని కొంత భాగం, కొత్తకోటరోడ్డు పనులను చేసేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమైనట్లు తెలిపారు. అనంతరం జిల్లాకేంద్రంలోని 7, 25 వార్డులలోని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలు అందుతున్న, పొందుతున్న వారి వివరాలను సేకరించారు. మార్కెట్‌లో నియోజకవర్గ అభివృద్ధి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అసౌకర్యాల సంత..



సంతలో కూరగాయలు కొంటున్న ప్రజలు

ఆత్మకూర్: పట్టణంలో ఆదివారం నిర్వహించే సంత అసౌకర్యాల మధ్య కొనసాగుతుండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో అపరిశుభ్రత ప్రదేశాల్లోనే కూరగాయలు, మాంసం విక్రయాలు కొనసాగుతున్నాయి. ప్రతి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది ఇక్కడికి వస్తుంటారు. దుమ్ము, ధూళితో కూడిన కూరగాయలు, ఆకుకూరలతో లాభానికి బదులు నష్టమేనని వినియోగదారులు వాపోతున్నారు. పురపాలక పాలకులు, అధికారులు స్పందించి మార్కెట్ పనులు పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.


ఇళ్ల మధ్యే నిలిచిన నీరు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంబళాపురంలో అంతర్గత రహదారులు గుంతలు ఏర్పడంతో వానలకు నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల కింద సీసీ రోడ్డు వేశారు కానీ, గుంతలు పూడ్చలేదని కాలనీవాసులు తెలుపుతున్నారు. నీరు నిలిచి దుర్వాసన, దోమలు ఎక్కువై చిన్నారులు రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని, అధికారులు స్పందించి డ్రెయినేజీలు, సీసీ రహదారి వేయాలని కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిన నీరు

ఆదమరిస్తే అంతే..



ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రం నుంచి వెంకటాపురం వెళ్లే రహదారి ఎప్పుడు వాహనాలు, చిన్నపిల్లలు వృద్ధులు తిరుగుతూ ఉంటారు. కొన్ని రోజులుగా మిషన్ భగీరథ మ్యాన్‌హోల్‌పై ఉన్న సిమెంట్ మూత శిథిలమై ప్రమాదకరంగా మారింది. అయినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఎవరైనా ఆదమరిచి ఉంటే ప్రమాదం తప్పదు. చిన్న పిల్లలు కూడా అందులో పడే అవకాశం ఉంది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

రాకపోకల పునరుద్ధరణ



పాలిటెక్నిక్ రోడ్డులో మొదలైన రాకపోకలు

వనపర్తిటౌన్: పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా గల ప్రధాన రోడ్డులో వాహనాల రాకపోకలు పునరుద్ధరించారు. రెండు నెలల క్రితం కళాశాల ఎదుట హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం కొనసాగుతుండడంతో ఈ రహదారిలో పూర్తిస్థాయిలో రాకపోకలు నిలిపివేశారు. ఫలితంగా రెండు నెలల పాటు బస్టాండ్ నుంచి బస్సు డిపో మీదుగా రాజీవ్‌చౌక్, పాత బస్టాండ్ వరకు ఇరుకైన వన్ వేలోనే కొనసాగాయి. ఒకే దారిలో ట్రాఫిక్ జామ్ కావడంతో ఇబ్బందులు తప్పేవి కావు. బస్టాండ్ నుంచి హైదరాబాద్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, ఆత్మకూర్ తదితర రూట్లల్లో బస్సులు వెళ్లడం, రావడం ఒకేదారిలో ఉండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడేది. పాలిటెక్నిక్ కళాశాల ఎదుట రూట్ క్లియర్ కావడంతో ఇబ్బందులు తప్పినట్లయ్యింది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొల్లాపూర్: పట్టణంలోని గాంధీ హైస్కూల్‌లో 1988–89 విద్యాసంవత్సరంలో ఎస్‌ఎస్సీ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఎస్‌ఎం గార్డెన్‌లో సమావేశమయ్యారు. ఆత్మీయ సమ్మేళనంలో వారు కలిశారు. యోగ క్షేమాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం వారు చేస్తున్న ఉద్యోగాలు, వ్యాపారాలు, ఇతర పనులను చర్చించుకున్నారు. తాము చదువుకున్న కాలంనాటి పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు రుణపడి ఉంటామన్నారు. సమావేశం అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు సాయిబాబుశెట్టి, వేములవాడ రమేష్ ముదిరాజ్, కరీమ్, షఫీ, రజినీ, కిషన్‌సింగ్ తదితరులున్నారు.

ఇల్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఫైజొద్దీన్

కొల్లాపూర్: పట్టణంలోని రంగదాసువీధిలో అక్రమంగా తన ఇంటిని కూల్చి చదును చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ కట్టికోత మిషన్ ఫైజొద్దీన్ కోరారు. ఆదివారం ఆయన తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడారు. 25 సంవత్సరాల కిందట తాను ఇంటి నంబర్ 2–8–111 ఉన్న ఇంటిని ముస్లిం మత పెద్దల సమక్షంలో సాదాకాగితంపై కొనుగోలు చేశానని చెపప్పారు. అయితే కొందరు వ్యక్తులు తప్పుడు పవర్‌ఆఫ్ అటార్నీ పత్రాలతో తనను ఇల్లు ఖాళీ చేయిచేందుకు గతంలో ప్రయత్నించారని ఆరోపించారు. దీనిపై కోర్టును ఆశ్రయించామన్నారు. ఇంటిని అమ్మిన వ్యక్తి చనిపోవడంతో ఆయన బంధువుల పేరిట ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండానే మున్సిపల్ అధికారులు మార్చేశారన్నారు. దాన్ని ఆధారంగా చూపి రిజిస్ట్రేషన్లు కూడా చేసుకున్నారన్నారు. ఈ విషయాలేవీ తనకు తెలియవని వివరించారు. ఇంటి పత్రాల మార్పు వివరాలు తెలపాలని మున్సిపల్ కార్యాలయంలో సమాచార హక్కుచట్టం ద్వారా దరఖాస్తు చేశానన్నారు. ఈ క్రమంలోనే రెండు రోజుల కిందట అలీ అనే వ్యక్తి తన అనుచరులతో వచ్చి జేసీబీతో ఇంటిని పడగొట్టి, చదును చేశారన్నారు. ఇంట్లోని కలప దుంగలు, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇటీవలే తన సామిల్ కాలిపోయిందని, ఇదికూడా అలీ వారు చేసిఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసు, మున్సిపల్ అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. కోర్టు తీర్పు వచ్చే వరకు కూడా ఆగకుండా ఇల్లు కూల్చేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. జూపల్లి నాగేంద్రం తదితరులున్నారు.

ఖాళీ స్థలంలో నిర్మాణం చేపడతాం



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఈద్గా వక్ఫ్ రహెమానియా పక్కన ఉన్న ఖాళీ వక్ఫ్ స్థలంలో ముస్లిం కమ్యూనిటీహాల్ షాదీఖానా నిర్మాణాలు చేపడతామని పలువురు ముస్లిం ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతులమీదుగా రూ.కోటి నిధులతో వీటి నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈద్గా వద్ద నిర్మాణం చేపడుతారని కొందరు వాస్తవాలకు దూరంగా మాట్లాడుతున్నారని, కానీ ఈద్గా సమీపంలో ఖాళీగా ఉన్న వక్ఫ్ స్థలంలో నిర్మాణం చేపడుతామని తెలిపారు. నిర్మాణం తర్వాత భవనం ఈద్గా కమిటీకి చెందుతుందన్నారు. భవనాన్ని ఈద్ ప్రార్థనల కోసం వినియోగిస్తామన్నారు. అదేవిధంగా హాల్‌ను అనాథల వివాహాలకు ఉచితంగా ఇస్తామన్నారు. మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ కోఆర్డినేటర్ కమిటీ సభ్యులు ఖాజా ఫయాజుద్దీన్ అన్వర్‌పాష, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్‌రహెమాన్, ఈద్గా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తఖీ హుస్సేన్, హాఫీజ్ ఇద్రీస్, జామియ మజీద్ మేనేజింగ్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అహ్మద్‌సనా, అబ్దుల్ జకీ, నాయకులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ద్యావర్ల మహేశ్ కొంతకాలం క్రితం విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజ్ గౌడ్, నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, రాష్ట్ర నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి అయ్యూబ్‌ఖాన్ పరామర్శించి రూ.రెండు లక్షల బీమా చెక్కును మహేశ్ భార్య సంధ్యకు అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన మహేష్ గ్రామంలో పార్టీ అభివృద్ధికి కృషి చేశారని, పార్టీ సభ్యత్వం తీసుకోవడంతో రూ.రెండు లక్షల బీమా మంజూరైందన్నారు.

అధ్యక్షులకు సన్మానం

మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, అరణ్ కుమార్‌లను టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజ్ గౌడ్, డీసీసీ నారాయణపేట అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సన్మానించారు. పార్టీ కార్యక్రమాలతో పాటు మండలం, నియోజక వర్గంలో పార్టీ ఎదుగుదల కోసం నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కురుమూర్తి, తౌఫిక్, విష్ణు, హన్మంత్ నాయక్, నాగునాయక్, రహ్మతుల్లా, రవి, గోవర్ధన్ పాల్గొన్నారు.